సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
బుధవారం । 3 । సెప్టెంబర్ । 2025



నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయంలోని నిత్యాన్నదాన ట్రస్టుకు ఒబిలిశెట్టి రవిచంద్ర బాలబాలాజీ, లీల వెంకట సత్యవాణి దంపతు లు (విశాఖపట్నం) మంగళవారం రూ.లక్ష విరాళం సమర్పించారు.



అన్నదాన పథకానికి రూ.లక్ష

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి మద్దుకూరి అన్నపూర్ణ (బెండపూడి) రూ.లక్ష విరాళాన్ని దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్‌కు మంగళవారం అందజేశారు.

వదినామరదళ్లు మృతి



ఏలేరు కాలువలో ఎటువంటి అనుమతులు లేకుండా, పొక్లెయిన్లతో ఇసుక అక్రమ తవ్వకాలు చేపట్టడం వల్ల భారీ గోతులు ఏర్పడ్డాయి. అందులో పడి మంగళవారం వదినామరదళ్లు మృత్యువాత పడడం పలువురిని కలచివేసింది.

న్యూస్‌రీల్

దళితుల ఐక్యతను దెబ్బతీసిన ఎస్సీ వర్గీకరణ



అమలాపురంలో మాట్లాడుతున్న మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ రత్నాకర్

అమలాపురం టౌన్: కేంద్ర రాష్ట్రాలు ఏక పక్షంగా చేసిన ఎస్సీ వర్గీకరణ.. దళితల ఐక్యతను దెబ్బ తీసిందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు (నేషనల్ ఫర్ మాల మహానాడు అండ్ రాక్స్) డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్ అన్నారు. ఇది దేశ చరిత్రలోనే అతి పెద్ద రాజకీయ కుట్ర అని విమర్శించారు. అమలాపురంలోని ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ వల్ల వంద మందిలో నలుగురికే లబ్ధి కలుగుతోందని, ఈ వర్గీకరణ ఫలాలను దేశ వ్యాప్తంగా ఎస్సీలుగా ఉన్న 1,108 కులాలకు ఎలా పంచుతారని ప్రధాన మంత్రి మోదీని ప్రశ్నించారు. అలాగే నాలుగు ఎస్సీ సీట్లను తెలుగు రాష్ట్రాల్లోని 59 ఎస్సీ కులాలకు చంద్రబాబు, రేవంత్ రెడ్డి ఎలా పంచుతారన్నారు. మాల సామాజిక వర్గంపై చంద్రబాబు కక్ష కట్టారని ఆరోపించారు. వర్గీకరణకు వ్యతిరేకంగా శాంతియుత పోరాటానికి తెలుగు రాష్ట్రాల్లో మాలలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాల మహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు కొంకి వెంకట్రావు, నాయకులు నెల్లి సూరిబాబు, గుర్రాల రాంబాబు, చీకురుమిల్లి కిరణ్ కుమార్, పోతుల సుందరం, కాశి వీర వెంకట సత్యనారాయణ, కుసుమ సునీల్ కుమార్ పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జేసీ నిషాంతి

అమలాపురం రూరల్: జిల్లాలో ఇంత వరకు ఎటువంటి ప్రభుత్వ నివేశన స్థలం పొందని వారికి అందరికీ ఇల్లు పథకంలో భాగంగా స్థలం మంజూరు చేయాలని రెవెన్యూ సిబ్బందికి జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి ఆదేశించారు. భూ పరిపాలన ముఖ్య కమిషనర్ జయలక్ష్మి మంగళవారం అమరావతి నుంచి వివిధ జిల్లాల జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం జేసీ అధికారులతో మాట్లాడారు. పట్టాదారు పాస్ పుస్తకాలు అర్హులందరికీ అందించాలన్నారు. ప్రభుత్వ సేవలపై లబ్ధిదారుల సంతృప్తి స్థాయిలను తెలుసుకునేందుకు ఐవీఆర్ఎస్ సర్వే చేస్తుందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కొత్త మాధవి, రెవెన్యూ డివిజనల్ అధికారులు పి.శ్రీకర్, దేవరకొండ అఖిల, జిల్లా వ్యవసాయ అధికారి బోసు బాబు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పవిత్రోత్సవాలు



ఉత్సవ మూర్తులకు అభిషేకం చేస్తున్న అర్చకులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం రెండో రోజు పవిత్రోత్సవాలను ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీ ఎన్వీ ప్రసాద్ సారథ్యంలో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ పర్యవేక్షణలో స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, వేద పండితుడు చింతా వెంకటశాస్త్రి, అర్చకులు పూజలు నిర్వహించారు. ఆలయంలోని పురాతన కల్యాణ మండపంలో ఉన్న ప్రత్యేక వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులను ఉంచి, విశేష అభిషేకం జరిపారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమార రామగోపాల రాజా బహద్దూర్, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

కేంద్ర కారాగారాన్ని సందర్శించిన డీఎల్ఎస్ఏ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): కేంద్ర కారాగారాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి మంగళవారం సందర్శించారు. కేంద్ర కారాగారం, మహిళా జైలులో ఖైదీలకు అందిస్తున్న ఆహార ప్రమాణాలు, సదుపాయాలు పరిశీలించారు. ఖైదీలతో పాటు వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ముద్దాయిలు, ఖైదీలకు అందుబాటులో ఉన్న లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సేవలను వినియోగించుకోవాలన్నారు.



రావులపాలెంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కొత్తపేట మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి



పి.గన్నవరం సెంటర్‌లో వైఎస్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి

సంక్షేమ శేఖరం

- సంక్షేమానికి చిరునామా వైఎస్సార్
- పేద వర్గాల ఆశాజ్యోతి
- స్మరించుకున్న నాయకులు, ప్రజలు, అభిమానులు
- వర్ధంతి సందర్భంగా దివంగత ముఖ్యమంత్రికి నివాళి



వైఎస్సార్‌కు నివాళి అర్పించిన అనంతరం మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్ర బోస్, చిత్రంలో కో ఆర్డినేటర్ పిల్లి సూర్య ప్రకాష్

సాక్షి, అమలాపురం: సంక్షేమ సారథి.. అభివృద్ధి ప్రదాత.. పచ్చని సీమ అభివృద్ధిపై చెరగని ముద్ర వేసిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డికి కోనసీమ గెడ్డ ఘన నివాళి అర్పించింది. ఆయన చేసిన సేవలను మనసారా స్మరించుకుంది. వైఎస్సార్ వర్ధంతిని మంగళవారం వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు నిర్వహించారు. ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జోహార్ వైఎస్సార్, వైఎస్సార్ అమర్ రహే అంటూ నినాదాలు చేశారు.

- జిల్లా కేంద్రమైన అమలాపురంలో వైఎస్సార్ వర్ధంతి నిర్వహించారు. స్థానిక హైస్కూల్ సెంటర్‌లోని ఆయన కాంస్య విగ్రహానికి ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్ నివాళులర్పించారు. పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక ఏరియా ఆస్పత్రిలో రోగులకు, హరి మనోవికాస కేంద్రంలో మానసిక దివ్యాంగులకు పండ్లు పంపిణీ చేశారు. అల్లవరంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, మాజీ ఎంపీ చింతా అనూరాధ పాల్గొన్నారు.
- ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సాగునీటి రంగానికి వైఎస్సార్ చేసిన కృషిని ఈ ప్రాంత రైతులు ఎన్నటికీ మరువ లేరని, వైఎస్సార్ అంటేనే రైతు బాంధవుడిగా చెరగని ముద్ర వేసుకున్నారని జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. పి.గన్నవరం మూడు రోడ్ల జంక్షన్‌లో పార్టీ కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వైఎస్సార్‌కు నివాళి అర్పించారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి తదితరులు పాల్గొన్నారు.
- దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్‌కు ముమ్మిడివరంలో మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ నివాళి అర్పించారు. స్థానిక పోలమ్మ చెరువు వద్ద వైఎస్సార్ శిలా విగ్రహానికి పూలమాలలు వేశారు.
- మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి పేదల గుండెల్లో నిలిచిన నాయకుడని, సంక్షేమానికి మరో పేరుగా నిలిచారని కొత్తపేట మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. రావులపాలెంలోని వైఎస్సార్ సీపీ క్యాంపు కార్యాలయంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గం పరిధిలో గోపాలపురం, ఈతకోట సెంటర్లలో వైఎస్సార్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యానికి వైఎస్సార్ పెద్ద పీట వేశారన్నారు.

- రామచంద్రపురంలో వైఎస్సార్ విగ్రహానికి రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్ర బోస్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అభివృద్ధికి చేసిన కార్యక్రమాలను వివరించారు. ఆయనతో తనకు ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. పార్టీ నియోజకవర్గం కో ఆర్డినేటర్ పిల్లి సూర్య ప్రకాష్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.
- వైఎస్సార్‌ను స్ఫూర్తిగా తీసుకుని పనిచేయాలని ఎమ్మెల్సీ, మండపేట నియోజకవర్గ కో ఆర్డినేటర్ తోట త్రిమూర్తులు పిలుపునిచ్చారు. ఆయన ఆధ్వర్యంలో మండపేట నియోజకవర్గంలో వైఎస్సార్‌కు నివాళులర్పించారు. మండపేట రాజారత్న సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

ఉచిత బస్సుతో ఆటోడ్రైవర్ల
ఉపాధికి గండి



సమావేశంలో మాట్లాడుతున్న సత్తిరాజు

- నేటి నుంచి నల్లబ్యాడ్జీలతో నిరసనలు
- ఆంధ్ర ఆటోవాలా జిల్లా శాఖ అధ్యక్షుడు సత్తిరాజు

అమలాపురం టౌన్: కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రవేశపెట్టి, ఆటో డ్రైవర్ల ఉపాధికి గండి కొట్టిందని ఆంధ్ర ఆటోవాలా జిల్లా శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం నుంచి ఆటో డ్రైవర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి, ఆటోలకు నల్ల జెండాలు తగిలించి నిరసన తెలిపాలని ఆయన పిలుపునిచ్చారు. అమలాపురం హైస్కూల్ సెంటర్‌లో మంగళవారం డివిజన్ ఆటో డ్రైవర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సత్తిరాజు నిరసన కార్యక్రమాలకు కార్యాచరణ ప్రకటించారు. దీనిపై సమావేశం ఏకగ్రీవ తీర్మానం కూడా చేసింది. త్వరలోనే 48 గంటల పాటు ఆటోలు నిలిపివేసి నిరాహార దీక్షలు చేపడతామని ఆయన వెల్లడించారు. రామచంద్రపురం డివిజన్ ఆటో డ్రైవర్లతో బుధవారం నిర్వహించే సమావేశంలో ఆ తేదీ ప్రకటిస్తామని చెప్పారు. జిల్లాలో 25 శాతం ఆటోలు విద్యాసంస్థలకు విద్యార్థులను తరలిస్తున్న క్రమంలో ఆ ఆటోల డ్రైవర్లు 48 గంటల నిరాహార దీక్షకు రెండు రోజుల ముందు ఆయా విద్యా సంస్థలకు నోటీసులు ఇవ్వాలని సమావేశం సూచించింది. తక్షణమే కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం పథకాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసింది. సమావేశంలో ఆటోవాలా జిల్లా శాఖ కార్యదర్శి ఊటాల వెంకటేష్ నిరసన తీర్మానాలు సమావేశంలో ప్రవేశపెట్టారు. ఆటో యూనియన్ల ప్రతినిధులు మోకా శ్రీను, వాసంశెట్టి శ్రీను, డివిజన్ అధ్యక్షుడు బొలిశెట్టి శంకర్, ప్రధాన కార్యదర్శి బొక్కా నాని, కోశాధికారి బొమ్మి ఫణి, రాయుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ అభిమానుల వీరంగం

- పుట్టిన రోజు వేడుకల పేరుతో రచ్చరచ్చ
- బైక్ సైలెన్సర్లు పీకి భారీ శబ్దాలతో ర్యాలీ
- ప్రశ్నించిన వారిపై దాడి
- కొత్తపేట ప్రభుత్వాస్పత్రిలో చేరిన బాధితులు
- పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి



జన సైనికుల దాడిలో గాయపడి, కొత్తపేట ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సుబ్బలక్ష్మి, సూర్యనారాయణలను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: డిప్యూటీ సీఎం, జనసేనాని పవన్ కల్యాణ్ పుట్టిన రోజు వేడుకల పేరుతో జన సైనికులు, పవన్ కల్యాణ్ అభిమానులు రచ్చరచ్చ చేసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారు. రావులపాలెం మండలం ఈతకోట గ్రామంలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకున్న ఈ ఘటనలో గాయపడిన బాధితులు కొత్తపేట ప్రభుత్వాస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి.. బాధితులను కొత్తపేట ఆస్పత్రిలో పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు.

గ్రామాల్లో ర్యాలీ

పవన్ కల్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా జన సైనికులు మోటారు సైకిళ్ల సైలెన్సర్లు పీకి భారీ శబ్దాలతో గ్రామాల్లో ర్యాలీ చేశారు. ఈ ర్యాలీ రావులపాలెం మండలం ఈతకోట గ్రామంలోని గౌడ రామాలయం వద్దకు రాగా అక్కడ ఉన్న టీడీపీ అభిమానులు ఏర్పాటు చేసిన బాలకృష్ణ, ఎన్టీఆర్ ఫ్లెక్సీలు ఉండటంతో ఆ ప్రాంతంలో గొడవ చేశారు. ఈ సమయంలో అక్కడ వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసి మండపంలో ఉన్న పలువురు 'ఏమిటి ఈ గొడవ, పుట్టిన రోజు వేడుకలు అంటే ఇలా ప్రజలను ఇబ్బంది పెట్టకూడదు' అనడంతో జన సైనికులు రెచ్చిపోయి దుర్భాషలాడారు. ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరగడంతో కర్రలు, రాళ్లతో ప్రశ్నించిన వారిపై దాడి చేశారు.

21 మందిపై కేసు

దీనిపై రావులపాలెం టౌన్ సీఐ శేఖరబాబును సాక్షి వివరణ కోరగా బైక్ ర్యాలీలకు ఎటువంటి అనుమతులు లేవని, పోలీసులు ఇవ్వలేదన్నారు. దాడి ఘటనలో 21 మంది కేసు నమోదు చేసి, మూడు మోటారు సైకిళ్లు సీజ్ చేశామన్నారు.

ముగ్గురికి గాయాలు

జన సైనికుల దాడిలో మట్టా సుబ్బలక్ష్మి ముఖంపై గాయమైంది. స్కూలు నుంచి ఇంటికి వెళుతున్న ఆరో తరగతి విద్యార్థిని మానే వెంకట ఐశ్వర్య భుజంపై రాయి తగలింది. వినాయకుడి మండపంలో పూజ కోసం సామగ్రి తీసుకువస్తున్న మట్టా సూర్యనారాయణ అనే యువకుడికి తలపై మరో రాయి బలంగా తగిలింది. దీంతో జన సైనికులు అక్కడ నుంచి పరారయ్యారు. బాధితులు కొత్తపేట ఏరియా ఆస్పత్రిలో చేరారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి హుటాహుటీన ఆస్పత్రికి చేరుకుని బాధితులను పరామర్శించి బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజల మీద దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. సైలెన్సర్లు తీసి బైకులతో రచ్చ చేయడం వల్ల గర్భిణులు, చిన్న పిల్లలు భయభ్రాంతులకు గురవుతారన్నారు. ఆయన వెంట అముడా మాజీ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, కొత్తపేట ఎంపీపీ మార్గాన గంగాధరరావు, మండల కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు, ముసునూరి వెంకటేశ్వరరావు, కొత్తపేట పార్టీ ప్రెసిడెంట్ సలాది బ్రహ్మాజీ రావు ఉన్నారు.

రొయ్యల ఫ్యాక్టరీలకు అనుమతి తప్పనిసరి

- కలెక్టర్ మహేష్ కుమార్
- పర్యవేక్షణ తనిఖీ కమిటీ సభ్యులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: జిల్లాలో రొయ్యల ఫ్యాక్టరీల యాజమాన్యాలు తప్పనిసరిగా అన్ని రకాల అనుమతులు పొందాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అన్నారు. ఈ మేరకు మంగళవారం జిల్లా రొయ్యల పరిశ్రమల పర్యవేక్షణ తనిఖీ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ కాలుష్య నియంత్రణ చర్యలు, అనుమతుల పర్యవేక్షణ తనిఖీ కమిటీని నియమిస్తూ ప్రభుత్వం ఆరుగురు సభ్యులతో ఈ ఏడాది మే 18న జీవో విడుదల చేసిందన్నారు. వీరికి అదనంగా మరో ఐదు శాఖల అధికారులను ఈ పర్యవేక్షణ తనిఖీ కమిటీలో నియమించారు. ఈ కమిటీకి నోడల్ అధికారిగా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్, సభ్యులుగా జీఎం డీఏజీ, మత్స్యశాఖ జేడీ, జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్, ఎంపెడ అధికారులు, డీఎంహెచ్ఓ ఉన్నారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జీవీవీఎస్ నారాయణ, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ టి.నాగలక్ష్మి, జిల్లా మత్స్యశాఖ అధికారి జీవీ శ్రీనివాసులు, డీఎంహెచ్‌వో దుర్గారావు దొర, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ శంకర్రావు పాల్గొన్నారు.

⌘ పేరూరు ఉన్నత పాఠశాలలో అమలాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను తాత్కాలికంగా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ వెల్లడించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో అధికారులు, ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆలమూరు మండలంలో మంజూరైన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆశించిన స్థాయిలో విద్యార్థులు లేనందున రావులపాలెం కేంద్రంగా మార్చి, ఉదయం జూనియర్ కాలేజీ, మధ్యాహ్నం డిగ్రీ కాలేజీగా నిర్వహించే వారన్నారు. ప్రస్తుతం రావులపాలెంలో కేవలం 13 మంది మాత్రమే విద్యను అభ్యసిస్తున్నారన్నారు. అమలాపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు డిమాండ్ ఎక్కువగా ఉన్న దృష్ట్యా, జీవో నెంబర్ 64 ప్రకారం స్థానికంగా కళాశాలను స్థాపించాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు పేరూరులో కేటాయించిన స్థలంలో నిర్మాణానికి చర్యలు తీసుకున్నామన్నారు. తాత్కాలికంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న గదుల్లో ఈ విద్యా సంవత్సరం నుంచి బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులు నిర్వహిస్తామన్నారు. ప్రవేశాల కోసం 94911 91635, 94414 81707, 99516 78760 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఇన్‌స్పైర్ అయ్యేనా..!

- ఇన్‌స్పైర్ మనాక్ దరఖాస్తులకు ఈ నెల 15 వరకు గడువు
- 2025–26 జిల్లా నామినేషన్ల లక్ష్యం 1,780
- ఇప్పటి వరకు నమోదైనవి కేవలం 140 మాత్రమే..



రాయవరం: విద్యార్థుల్లో శాస్త్రీయ సాంకేతికతను పెంపొందించి.. భావి శాస్త్రవేత్తలను తయారు చేసేందుకు లభించే అరుదైన అవకాశం ఇన్‌స్పైర్ మనాక్. దీనిపై ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు స్కూళ్ల సైన్స్ టీచర్లు ఆసక్తి చూపడం లేదు. ఇన్‌స్పైర్ మనాక్ కింద కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న శాస్త్రీయ ప్రయోగ పోటీలకు ఆశించిన మేర స్పందన కరవైంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలోని 334 ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను కలిపి ప్రతి పాఠశాల నుంచి ఐదు ప్రాజెక్టుల చొప్పున 1,780 ప్రాజెక్టులను యాప్ ద్వారా అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ఇప్పటివరకు కేవలం 48 పాఠశాలలకు సంబంధించి 140 ప్రాజెక్టులు మాత్రమే నమోదయ్యాయి. అన్ని యాజమాన్యాల పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ఇందులో భాగస్వాములు కావాల్సి ఉంది. ఆ దిశగా వారు అంతగా చొరవ చూపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇన్‌స్పైర్ మనాక్ నామినేషన్లు నమోదు చేసుకునేందుకు సంబంధించిన గడువు ఈ నెల 15వ తేదీతో ముగుస్తుంది. ఇన్‌స్పైర్ మనాక్ ఉన్నతాధికారులు దృష్టి సారిస్తే మినహా లక్ష్యం పూర్తయ్యే అవకాశాలు కనిపించడం లేదు.

సెప్టెంబర్ 2వ తేదీ నాటికి ఇన్‌స్పైర్ మనాక్ వివరాలు

జిల్లా	మొత్తం స్కూళ్లు	నమోదు అయినవి	నమోదు కానివి
కాకినాడ	331	40	291
తూర్పుగోదావరి	352	34	318
కోనసీమ	334	48	286



ప్రయోగం చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

అవగాహన కల్పిస్తున్నాం



ఇన్‌స్పైర్ మనాక్ పోటీల్లో ప్రాజెక్టులను ఎంపిక చేయడానికి జిల్లాలోని సైన్స్ ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ మీటింగ్ ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. దీంతో పాటు యాప్‌కు సంబంధించి ఎలాంటి సందేహాలున్నా నా దృష్టికి తీసుకురావాలని తెలియజేశాను. జిల్లాలోని అన్ని యాజమాన్యాలకు సంబంధించి ప్రాజెక్టుల నమోదుకు సెప్టెంబర్ 15వ తేదీ వరకు మాత్రమే గడువు ఉంది. ఇప్పటికైనా హెచ్ఎంలు, ఉపాధ్యాయులు తొందరపడాలి.

– జీవీఎస్ సుబ్రహ్మణ్యం,
జిల్లా సైన్స్ అధికారి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

నిర్లక్ష్యం చేయడం తగదు



ఇన్‌స్పైర్ మనాక్ నామినేషన్లకు సంబంధించి అన్ని యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు స్పందించాలి. సైన్స్ ఉపాధ్యాయులు బాధ్యత తీసుకుని నామినేషన్లను త్వరితిగతిన పూర్తి చేయాలి. ప్రతి పాఠశాల నుంచి తప్పనిసరిగా ఐదు నామినేషన్లు వచ్చేలా చూడాలి. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి లక్ష్యాన్ని పూర్తి చేయాలి.

– డాక్టర్ షేక్ సలీం బాషా,
జిల్లా విద్యాశాఖాధికారి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్త కొబ్బరి (క్వింటాల్)	20,000 – 21,500
కొత్త కొబ్బరి (రెండో రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	31,500
గటగట (వెయ్యి)	30,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	30,000
గటగట (వెయ్యి)	28,500
నీటికాయ	
పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	23,000 – 24,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	23,000 – 24,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	5,250
కిలో	350

ఎలుకలుకలు

- ఏటా సార్వాలో రైతులకు తప్పని బెడద
- వరి పిలకలను కొరికేస్తుండడంతో తీవ్ర నష్టం
- నేడు ఆలమూరు, రామచంద్రపురం సబ్ డివిజన్లలో సామూహిక నివారణ



కొత్తపేట: వరిలో ఎలుకల బెడద ఎక్కువైంది. ముఖ్యంగా వరి పంటను మూషికాలు నాశనం చేస్తున్నాయి. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఆకుమడి దశ నుంచి కుప్పల వరకు రైతులకు ఈ సమస్య తప్పడం లేదు. దీంతో అధికంగా నష్టపోతున్నారు. పంట చేతికందే వరకు ఎలుకల బెడద ఉంటోంది. వీటిని సమర్థంగా అరికట్టేందుకు రైతులంతా సామూహిక నిర్మూలన చర్యలు చేపట్టడం వల్లే సాధ్యమని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. వరితో పాటు, ఉద్యాన పంటలైన కొబ్బరి, అరటి, కూరగాయల తోటలకు ఎలుకల బెడద ఎదురవుతోంది. ప్రస్తుతం వరి పంట దుబ్బు చేసి, పిలకలు వేసే దశలో ఉంది. ఈ దశలో ఎలుకల వల్ల కలిగే నష్టం అపారంగా ఉంటుంది. ఎలుకలు నీటి మట్టానికి 6 సెంటీమీటర్ల ఎత్తులో వరి పిలకలను కొరికేస్తున్నాయి. దీంతో దిగుబడి తగ్గి రైతులు నష్టపోయే అవకాశాలు ఎక్కువ.

ఇలా గుర్తించవచ్చు

ఎలుకలు సంచరించే పొలం గట్లపై బొరియలు ఉంటాయి. పొలంలో కొరికి వేసిన వరి పిలకలు, దుబ్బులు పడి ఉంటాయి. పొలంలోని బురదలో ఎలుకల పాదముద్రలు కనిపిస్తాయి. ఎలుకల విసర్జనాల ద్వారా వాటి ఉనికిని సులభంగా గుర్తించవచ్చు.

నివారణ చర్యలు

ముందుగా రైతులు తమ పొలం గట్లపై కలుపు మొక్కలను పూర్తిగా తొలగించాలి. రైతు భరోసా కేంద్రాల్లో బ్రొమోడయోలిన్ అనే ఎరను రైతులకు ఉచితంగా లభిస్తుంది. 480 గ్రాముల నూకలు, 10 గ్రాముల

పాడి-పంట

బ్రొమోడయోలిన్ మందు, 10 గ్రాముల నూనెతో 500 గ్రాముల ఎరను తయారు చేసుకోవచ్చు. ఈ ఎర 50 బొరియలకు సరిపోతుంది. తొలి రోజు బొరియలను మట్టితో కప్పేయాలి. రెండో రోజు ఆ బొరియలు తెరుచుకుని కనిపిస్తాయి. ఈ బొరియల వద్ద 10 గ్రాముల బ్రొమోడయోలిన్ ఎర పొట్లాలను ఉంచాలి. ఆ ఎరను తిన్న ఎలుకలు చనిపోతాయి. రెండో విధానంలో వేటగాళ్లతో ఎలుక బుట్టలు వేయించి, వాటిని అరికట్టవచ్చు. ఈ విధానంలో వేటగాళ్లు ఎలుకకు రూ.60 వరకు తీసుకుంటారు. మరో విధానంలో బొరియలో పొగ పెట్టి ఎలుకలను చంపుతారు. ఇలా చేస్తే ఒక్కో ఎలుకకు రూ.100 తీసుకుంటారు. రెండు విధానాలు అధిక ఖర్చుతో కూడినది కావడంతో, రైతులు బ్రొమోడయోలిన్ ఎర ద్వారానే నివారణ సులభమని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.



వరి పంటను కొరుకుతున్న ఎలుక

రెండు సబ్ డివిజన్లలో..

ప్రస్తుత సీజన్‌లో కోనసీమ జిల్లాలో 1.94 లక్షల ఎకరాలు వరి, బంజరు భూములు ఉండగా, 79,475 మంది రైతులు వివిధ పంటలు సాగు చేస్తున్నారు. ఆయా పంటలను ఎలుకల బారి నుంచి రక్షించేందుకు వ్యవసాయ శాఖ సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని తలపెట్టింది. అమలాపురం, కొత్తపేట, పి.గన్నవరం, ముమ్మిడివరం, రాజోలు, ఆలమూరు, రామచంద్రపురం వ్యవసాయ సబ్ డివిజన్లకు 776 కిలోల బ్రొమోడయోలిన్ మందు చేరినట్టు అధికారులు తెలిపారు. మొత్తం 22 మండలాల్లో 415 గ్రామాలకు పంటల విస్తీర్ణాన్ని బట్టి మందును సరఫరా చేశారు. ముందుగా ఆలమూరు సబ్ డివిజన్‌లోని ఆలమూరు, కపిలేశ్వరపురం, మండపేట, రాయవరం, రామచంద్రపురం సబ్ డివిజన్‌లోని రామచంద్రపురం, కె.గంగవరం మండలాల్లో బుధవారం సామూహిక నిర్మూలన కార్యక్రమం చేపట్టనున్నారు. మిగిలిన సబ్ డివిజన్లలో ఈ నెల 4న లేదా 9న కార్యక్రమం నిర్వహించనున్నారు.

సామూహికంగానే చేపట్టాలి



సార్వా పంటకు ఎలుకల బెడద ఎక్కువగానే ఉంటుంది. ఎవరికి వారు ఎలుకలను పూర్తిగా నిర్మూలించడం సాధ్యం కాదు. సామూహికంగా బ్రొమోడయోలిన్ మందును బొరియల్లో పెట్టడం ద్వారా మాత్రమే సమర్థంగా అరికట్టవచ్చు. దీనిపై రైతులకు ఏటా అవగాహన కల్పించి, మందును ఉచితంగా అందిస్తున్నాం. ప్రస్తుత తొలకరి సీజన్‌లో ఎలుకలను అరికట్టడానికి అవసరమైన బ్రొమోడయోలిన్ మందు త్వరలోనే రైతు భరోసా కేంద్రాలకు వస్తుంది. గ్రామాల వారీగా, వరి ఆయకట్టుల వారీగా రైతులతో మందు ఎరను చేనుల్లో పెట్టించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– ఎం.వెంకటరామారావు, ఏడీఏ, కొత్తపేట

సీఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

లాఠీచార్జి దారుణమన్న బీజేపీ నేతలు



ఎస్పీని కలిసిన బీజేపీ నాయకులు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): శాంతియుతంగా ధర్నా చేస్తున్న తమపై త్రీటౌన్ సీఐ సత్యనారాయణ లాఠీచార్జి చేయడం దారుణమని, ఆయనపై చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో పలువురు పార్టీ నాయకులు మంగళవారం జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. బీహార్‌లో కాంగ్రెస్ నాయకులు ప్రధాని మోదీ, ఆమె తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ సోమవారం స్థానిక డీసీసీ కార్యాలయం వద్ద రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు వెళ్లగా, త్రీటౌన్ సీఐ ఆధ్వర్యంలో పోలీసులు తమను అడ్డుకున్నారన్నారు. తమ కార్యకర్తలపై లాఠీచార్జి చేసిన సీఐ.. కర్రలతో రౌడీల్లా ప్రవర్తించిన కాంగ్రెస్ నాయకులను నియంత్రించలేదన్నారు. లాఠీచార్జిలో తమ కార్యకర్తలకు గాయాలు కాగా, స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. తాము కూడా కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యులన్న సంగతి మరిచి, పోలీసులు ఇలా దౌర్జన్యం చేయడం తగదన్నారు.

కోడికత్తులతో దాడి కేసులో నలుగురి అరెస్టు



నిందితులతో ఎస్సై పవన్‌కుమార్, సిబ్బంది

గోకవరం: కృష్ణునిపాలెం పంచాయతీ పరిధిలో గత ఆదివారం వినాయక నిమజ్జనం ఊరేగింపు నిర్వహిస్తున్న ఓజుబంద గ్రామానికి చెందిన ఇద్దరిపై కోడికత్తులతో దాడి చేసిన నలుగురిని అరెస్టు చేసినట్టు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు. నిమజ్జనం ఊరేగింపు వెళుతుండగా గోకవరం గ్రామానికి చెందిన గేదెల శివనందు, రాయి అచ్చారావు, పోనసానపల్లి నాగవెంకటసాయి పవన్‌కామేష్, మహిపాల్ వీరవెంకట దుర్గాప్రసాద్ రెండు బైక్‌లపై వచ్చి, ఊరేగింపులో ఉన్న భరత్, రాజేష్‌పై కోడికత్తులతో విచక్షణారహితంగా దాడి చేసి పారిపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

క్లుప్తంగా

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

తాళ్లపూడి(కొవ్వూరు): పశివేదల–కొవ్వూరు స్టేషన్ల మధ్య రైల్వే ట్రాక్ వద్ద మంగళవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్టు తాడేపల్లిగూడెం జీఆర్పీ ఎస్సై అప్పారావు తెలిపారు. ఆయన వివరాల మేరకు, సుమారు 45 ఏళ్ల పురుషుడిని గుర్తు తెలియని రైలు ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడి అతడు మృతి చెందాడు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి, మార్చురీలో భద్రపరిచారు. మృతుడు తెలుపు రంగు చిన్న చారల ఫుల్‌హ్యాండ్ షర్టు, ఆకుపచ్చపై ఎరుపు రంగు పూల డిజైన్ ఉన్న లుంగీ, రంగురంగుల టర్కీ టవల్ కలిగి ఉన్నాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు. మృతుడి వివరాలు తెలిసినవారు 94906 17090, 99480 10061 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్టు



పోలీసుల అదుపులో ఉన్న నిందితుడు

కాకినాడ రూరల్: మనస్పర్థల కారణంగా తనను దూరంగా పెట్టిందనే కక్షతో సహజీవనం చేస్తున్న మహిళపై కత్తితో హత్యాయత్నానికి పాల్పడిన కాకినాడ రూరల్ పరకాల్వకు చెందిన మేడిశెట్టి రామకృష్ణను తిమ్మాపురం పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఎస్సై గణేష్‌కుమార్ వివరాల మేరకు, సూర్యారావుపేట గ్రామానికి చెందిన మహిళపై గత నెల 30న రాత్రి రామకృష్ణ ఆమె ఇంటికి వెళ్లి కత్తితో పొడిచాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతోంది. ఆమె ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని సూర్యారావుపేట నావెల్ ఎన్‌క్లేవ్ వద్ద అరెస్టు చేసి, కోర్టులో హాజరుపర్చామని ఎస్సై తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు పంపాలని కోర్టు ఆదేశించింది.

నీట మునిగి వదినామరదళ్ల మృతి

- ఏలేరు కాలువలో దుర్ఘటన
- మృతులు మందుల కాలనీకి చెందినవారు
- ఇసుక అక్రమ తవ్వకాలే కారణమంటున్న స్థానికులు

ఏలేశ్వరం: నీటి లోతు అవగాహన లేకపోవడంతో ఏలేరు కాలువలో దిగిన ఇద్దరు వదినామరదళ్లు మృత్యువాత పడిన సంఘటన కలకలం రేపింది. స్థానికుల వివరాల మేరకు, మందుల కాలనీకి చెందిన పెంగ్ర లక్ష్మి(38), పెంగ్ర కుమారి(13) వరుసకు వదినామరదళ్లు. వీరు గ్రామాల్లోని ఇళ్ల వద్దకు వెళ్లి తల వెంట్రుకలకు అల్యూమినియం పాత్రలు ఇచ్చే వ్యాపారం చేస్తుంటారు. ఇలాఉండగా, వీరిద్దరూ కలిసి వంట కోసం పుల్లలు ఏరుకునేందుకు ఏలేరు కాలువ వద్దకు వెళ్లారు. దాహం వేయడంతో కాలువలోకి దిగి.. గోతులు ఉన్న ప్రాంతంలో మునిగిపోయారు. సమీపంలో ఉన్న వ్యక్తులు గుర్తించి వారి బంధువులకు సమాచారం ఇచ్చారు. వారొచ్చి సంఘటన ప్రదేశంలో మునిగిపోయిన ఇద్దరినీ వెలికితీశారు. స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అప్పటికే వారు మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతురాలు లక్ష్మీకి భర్త అప్పన్న, కుమార్తెలు భవాని, జ్యోతి, కుమారులు హరి, అశోక్ ఉన్నారు. మృతురాలు కుమారికి తల్లిదండ్రులు సత్తిబాబు, అంకమ్మ, సోదరుడు రాజు, సోదరి శ్యామల ఉన్నారు. ఈ మేరకు ఎస్సై రామలింగేశ్వరరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మందుల కాలనీలో విషాద ఛాయలు

ఎప్పుడు కలిసి తిరిగే లక్ష్మి, కుమారి ఏలేరు కాలువలో మునిగి మరణించడంతో మందుల కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



లక్ష్మి మృతదేహం



లక్ష్మి (ఫైల్)

ఎప్పుడూ చలాకీగా కళ్ల ముందే తిరిగే వారిద్దరూ శాశ్వతంగా దూరం కావడంతో వారి కుటుంబాలు విషాదంలో మునిగిపోయాయి. తిరిగి రాని లోకానికి వెళ్లిపోయిందంటూ లక్ష్మి కుటుంబ సభ్యులు విలపించిన తీరు చూపరులను కలిచివేసింది.



కుమారి మృతదేహం



కుమారి (ఫైల్)

అక్రమ తవ్వకాలు

పాలకుల అండదండలతో ఇష్టారాజ్యంగా చేసిన ఇసుక అక్రమ తవ్వకాలు రెండు నిండుప్రాణాలను బలిగొన్నాయి. ఏలేరు కాలువలో ఎటువంటి అనుమతులు లేకుండా, పొక్లెయిన్లతో ఇసుక అక్రమ తవ్వకాలు చేపట్టడం వల్ల భారీ గోతులు ఏర్పడ్డాయి. కొందరు త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకుంటుండగా.. మరికొందరు వాటికి బలవుతున్నారు. స్థానిక కప్పలచెరువు సమీపంలోని శశ్మానం మీదుగా ఏలేరు కాలువలో రాత్రుళ్లు ట్రాక్టర్లు, లారీలతో ఇసుక అక్రమ తవ్వకాలు నిర్వహిస్తున్నారు. దీనిపై స్థానికులు అనేకసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా, పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దాదాపు ఏడాదిన్నర నుంచి ఏలేరు కాలువలో ఇసుకతో పాటు, మట్టినీ అక్రమంగా తవ్వేస్తున్నారని చెబుతున్నారు.



విలపిస్తున్న కుటుంబ సభ్యులు

గోదావరి నదిలో వృద్ధుడి గల్లంతు



రవణం సాయిబాబు (ఫైల్)

మామిడికుదురు: బి.దొడ్డవరం గ్రామానికి చెందిన ఒలుపు కార్మికుడు రవణం సాయిబాబు (78) మంగళవారం వైనతేయ గోదావరి నదిలో గల్లంతయ్యాడు. ఒలుపు ఒలిచేందుకు వెళ్లిన సాయిబాబు.. బహిర్భూమికి వెళ్లి, అదుపుతప్పి గోదావరి నదిలో పడి కొట్టుకుపోయాడని అతడి కుటుంబ సభ్యులు తెలిపారు. గల్లంతైన సాయిబాబు ఆచూకీ కోసం రెండు బోట్ల సహాయంతో గోదావరి నదిలో రెవెన్యూ అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. సంఘటనపై సాయిబాబు కుమారుడు పల్లంరాజు రెవెన్యూ, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేశారు.

యువకుడిని రక్షించిన పోలీసులు

అమలాపురం టౌన్: వినాయక విగ్రహాన్ని గోదావరిలో నిమజ్జనం చేస్తున్నప్పుడు అదుపుతప్పి నదిలో పడి కొట్టుకుపోతున్న యువకుడిని పట్టణ పోలీసులు కాపాడారు. బోడసకుర్రు–పాశర్లపూడి మధ్య వైనతేయ నదిపై ఉన్న వంతెన వద్ద సోమవారం రాత్రి ఈ ఘటన జరిగింది. అమలాపురం రూరల్ మండలం పేరూరు గ్రామం పల్లపువీధి నుంచి గణేశ్ విగ్రహాన్ని వైనతేయ నదిలో నిమజ్జనం చేసేందుకు గ్రామస్తులు ఊరేగింపుగా వెళ్లారు. నిమజ్జనం సమయంలో అదే గ్రామానికి చెందిన చిలకలూరి చినసాయికృష్ణ (27) అదుపుతప్పి నదిలో పడిపోయాడు. ప్రవాహంలో కొట్టుకుపోతున్న అతడిని స్థానికులు తాడు సాయంతో కాపాడేందుకు విఫలయత్నం చేశారు. అక్కడ బందోబస్తులో ఉన్న అమలాపురం పట్టణ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ మట్టపర్తి రాంబాబు, కానిస్టేబుల్ రాయుడు వీవీ శ్రీనివాసరావు స్పందించి.. మత్స్యకారుల సహకారంతో యువకుడిని పడవలో ఎక్కించి ఒడ్డుకు చేర్చారు.

స్నేహభావంతో పండగల నిర్వహణ



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ రాహుల్‌మీనా

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): జిల్లాలో వినాయక నిమజ్జనం, మిలాద్ ఉన్ నబీ పండగల సందర్భంగా నిర్వహించే ర్యాలీలు ప్రశాంతంగా, స్నేహపూర్వక వాతావరణంలో నిర్వహించేందుకు కృషి చేయాలని హిందూ, ముస్లిం, క్రైస్తవ మత పెద్దలను జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా కోరారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన ఏఎస్పీ మనిష్ పాటిల్ దేవరాజ్, డీఆర్వో వెంకటరావు, ఏఆర్ అదనపు ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి ఆయా మతపెద్దలతో జిల్లా స్థాయి శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. రెవెన్యూ, పోలీస్, పంచాయతీ, మున్సిపల్ కార్పొరేషన్, మత్స్య, అగ్నిమాపక శాఖల అధికారులు హాజరయ్యారు. వినాయక విగ్రహాల నిమజ్జనం, మిలాద్ ఉన్ నబీ పండగల సందర్భంగా చేపట్టాల్సిన చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. జిల్లాలో గణేశ్ నిమజ్జనాలు సజావుగా సాగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను జేసీ ఆదేశించారు. జిల్లాలో మొత్తం 25 నిమజ్జన ప్రదేశాలను గుర్తించామని, నిమజ్జనాలు జరిగే ప్రదేశాల వద్ద స్టేజ్, విద్యుద్దీపాలు, క్రేన్లు, బోట్లు, గజ ఈతగాళ్లు, ఇతర సదుపాయాలను సంబంధిత అధికారులు కల్పించాలన్నారు. వైద్యారోగ్య శాఖ ద్వారా నిమజ్జన ప్రదేశాల్లో వైద్య శిబిరాలు నిర్వహించడంతో పాటు, నిరంతర పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని స్పష్టం చేశారు. జిల్లా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఎప్పటికప్పుడు నీటి పరీక్షలు నిర్వహించి, జల కాలుష్యం అరికట్టేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ నెల ఐదున జరిగే మీలాద్ ఉన్ నబీ పండగ సందర్భంగా ముస్లింలకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని జేసీ అధికారులను ఆదేశించారు.

హత్య కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు

నల్లజర్ల: చీపురుగూడెంలో 2021 జూన్‌లో జరిగిన హత్య కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు, రూ.20 వేల జరిమానా విధిస్తూ కోర్టు మంగళవారం తీర్పు చెప్పింది. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం, గ్రామానికి చెందిన చల్లారి వెంకటేశ్వరావు వద్ద కల్లు తాగేందుకు అదే గ్రామానికి చెందిన కూనపాం బాబూరావు వచ్చాడు. డబ్బు అడిగిన వెంకటేశ్వరావుపై గొడవకు దిగిన బాబూరావు ఇనుప రాడ్డుతో అతడి తలపై కొట్టి హతమార్చాడు. తాడేపల్లిగూడెం సీఐ రవికుమార్ అప్పట్లో కేసు నమోదు చేశారు. కేసు విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడికి శిక్ష విధిస్తూ స్పెషన్స్ జడ్జి షేక్ సికిందర్ బాషా తీర్పు చెప్పారు. ఏపీపీ కుసులూరి శివరామకృష్ణ ప్రాసిక్యూషన్ తరఫున వాదించారు.

గల్ఫ్‌లో చిక్కుకున్న మహిళ స్వదేశానికి రాక

అమలాపురం రూరల్: జీవనోపాధి కోసం గల్ఫ్‌కు వెళ్లి.. అక్కడ చిక్కుకుని చిత్రవధలు అనుభవిస్తున్న మహిళ.. కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ చొరవతో స్వదేశానికి చేరింది. వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తపేట మండలం వీధివారలంకకు చెందిన వివాహిత చీకురుమల్లి మంగాదేవి స్థానికంగా సరైన ఉపాధి లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటోంది. దీంతో కుటుంబ పోషణ కోసం మూడు నెలల క్రితం అప్పు చేసి ఏజెంట్ ద్వారా గల్ఫ్‌కు వెళ్లింది. మూడు నెలలైనా ఆమెను ఎక్కడా పనిలో పెట్టలేదు. ఓ ఆఫీసులో ఉంచి ఆమెను ఇబ్బందులకు గురి చేశారు. సరైన భోజనం పెట్టకుండా, శారీరకంగా హింసించారు. దీంతో తాను స్వదేశానికి వెళ్లిపోతానని చెప్పడంతో, రూ.1.50 లక్షలు కట్టాలని ఒత్తిడి చేశారు. అప్పటికే అప్పులు చేయడం, కుటుంబ పరిస్థితి అంతంతమాత్రంగా ఉండడంతో ఆ సొమ్ము చెల్లించలేకపోయింది. ఇదే విషయాన్ని ఇటీవల అంబాజీపేట మండలం పుల్లేటికుర్రుకు చెందిన తండ్రి నెల్లి రామారావుకు ఫోన్‌లో చెప్పింది. ఇక్కడే ఇలా ఉంటే స్వదేశానికి ప్రాణాలతో రాలేనేమోనని ఆవేదన వెళ్లగక్కింది. కష్టాల్లో ఉన్న కుమార్తెను ఎలాగైనా కాపాడుకోవాలని అతడు తన భార్యతో కలిసి వారం రోజుల క్రితం కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్‌ను ఆశ్రయించారు. తమ గోడును కేంద్ర ప్రతినిధులకు వివరించారు. వెంటనే స్పందించిన అధికారులు ఆమెను స్వదేశానికి తీసుకువస్తామని భరోసా ఇచ్చారు. ఏజెంట్, అక్కడి ఆఫీస్, భారత రాయబార కార్యాలయం వారితో సంప్రదించారు. ఎట్టకేలకు మంగాదేవిని స్వదేశానికి తీసుకువచ్చినట్టు కేంద్రం నోడల్ అధికారి కె.మాధవి, సమన్వయకర్త జి.రమేష్ మంగళవారం తెలిపారు.



రామారావు దంపతులతో మాట్లాడుతున్న సమన్వయకర్త రమేష్

Adikavi Nannaya University : Rajamahendravaram
East Godavari district, Andhra Pradesh
Tender Ref No.ANUR/Engg/2025/3 Date:30.08.2025
e-Tender Notice
Online tenders are invited for (i) Providing Lift facility to VC Lodge in AKNU, Rajamahendravaram and (ii) Installation of CC Cameras and its equipment through https://tender.apeprocurement.gov.in. Last Date for submission is 15.09.2025 @ 05.00PM. For further details please contact University Engineer's Office.
Tender ID:840598, 838589
Registrar

ఆర్టీసీ బస్సు, వ్యాన్ ఢీ

ఆరుగురికి గాయాలు



యర్రవరం వద్ద బస్సును ఢీకొన్న వ్యాన్

ఏలేశ్వరం: జాతీయ రహదారిపై యర్రవరం వద్ద మంగళవారం ఆర్టీసీ బస్సు, వ్యాన్ ఢీకొన్న సంఘటనలో ఆరుగురికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు, ఏలేశ్వరం ఆర్టీసీ డిపో నుంచి రాజమహేంద్రవరం వెళుతున్న బస్సు జాతీయ రహదారిపై మలుపు తిరుగుతుండగా, రాజమహేంద్రవరం నుంచి విశాఖపట్నం వెళుతున్న వ్యాన్ ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సులో ఉన్న డ్రైవర్‌తో పాటు, ఐదుగురికి గాయాలయ్యారు. క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో ప్రత్తిపాడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేట్ ఆస్పత్రి వద్ద ఆందోళన

కాకినాడ రూరల్: వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మహిళ బ్రెయిన్ డెడ్ అయిందని ఆరోపిస్తూ ఆమె బంధువులు ఓ ప్రైవేట్ ఆస్పత్రి వద్ద మంగళవారం ఆందోళన చేపట్టారు. మృతురాలి బంధువుల వివరాల ప్రకారం, రమణయ్యపేట గైగోలుపాడుకు చెందిన మహిళ మేడిశెట్టి దుర్గాభవాని(38)కి భర్త వెంకటరమణ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గత నెల 30న సర్పవరం జంక్షన్ సమీపంలోని ఓ డెంటల్ ఆస్పత్రిలో దంత వైద్యానికి వెళ్లింది. దంతాలు తొలగించే క్రమంలో అధిక రక్తస్రావం కావడంతో, అదే రోజు మెరుగైన చికిత్సకు ఆమెను మరో ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. మంగళవారం ఉదయం ఆమెకు బ్రెయిన్ డెడ్ అయినట్టు వైద్యులు చెప్పడంతో, ఆమె బంధువులు ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే ఇలా జరిగిందని ఆరోపించారు. బోన్ మేరో క్యాన్సర్‌తో మెదడులో రక్తస్రావం కారణంగా బ్రెయిన్ డెడ్ అయినట్టు ఆస్పత్రి వైద్యులు స్పష్టం చేశారు. దీనిపై సర్పవరం పోలీసు స్టేషన్‌కు ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

పొట్టకూటికి వచ్చి.. చోరీల బాట

- పశ్చిమ బెంగాల్ వాసి అరెస్టు
- 37 గ్రాముల బంగారం స్వాధీనం

మలికిపురం: వేరే రాష్ట్రం నుంచి పొట్టకూటికి వచ్చిన వ్యక్తి.. చెడు అలవాట్లకు బానిసై చోరీల బాట పట్టిన ఉదంతమిది. చోరీ కేసుల్లో నిందితుడైన అతడిని అరెస్టు చేసి, రూ.3.50 లక్షల విలువైన 37 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్టు రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. రెండు రోజుల క్రితం తూర్పుపాలెంలో జరిగిన చోరీ ఘటనకు సంబంధించి మలికిపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కేసు దర్యాప్తు చేపట్టిన ఎస్సై పీవీఎస్ఎస్ సురేష్‌కుమార్ తన సిబ్బందితో నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. మంగళవారం మధ్యాహ్నం మలికిపురం మండలం తూర్పుపాలెం బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా తచ్చాడుతున్న పశ్చిమ బెంగాల్ రాష్ట్రం ఉత్తర 24 పరగణాల జిల్లా దుతుర్దా పరిధిలోని బైద్యాధి ప్రాంతానికి చెందిన రావుకుల్ తరఫ్దార్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారణ చేసి, ఇటీవల తూర్పుపాలెంలో జరిగిన చోరీ కేసు నిందితుడిగా గుర్తించారు. అతడు ఇచ్చిన సమాచారంతో 37 గ్రాముల బంగారాన్ని పోలీసులు రికవరీ చేశారు. జీవనోపాధి కోసం నిందితుడు పశ్చిమ బెంగాల్ నుంచి మలికిపురం మండలంలోని తూర్పుపాలెం గ్రామం వచ్చి ఉంటున్నాడు. కొన్నాళ్లు తూర్పుపాలెంలో చికెన్ షాపుల్లో, ఇటుక బట్టీల్లో పని చేశాడు. చెడు వ్యసనాలకు అలవాటు పడ్డాడు. కష్టపడి పని చేసే సంపాదన చాలకపోవడంతో, చోరీల బాట పడ్డాడు. సులభంగా డబ్బు సంపాదించాలని దొంగతనాలు మొదలుపెట్టాడు. ఇంకా ఇతడిపై ఏయే పోలీస్ స్టేషన్లలో చోరీ కేసులు నమోదయ్యాయో పోలీసులు ఆరా తీస్తున్నారు. కాగా కేసును త్వరితంగా ఛేదించిన ఎస్సై సురేష్‌కుమార్, సిబ్బంది ఏఈ విక్టర్‌బాబు, బాబ్జి, దుర్గాప్రసాద్, సుజన్, చిన్నను సీఐ అభినందించారు.



సొత్తు, నిందితుడిని చూపుతున్న సీఐ నరేష్‌కుమార్, ఎస్సై సురేష్‌కుమార్

సాక్షి క్లాసిఫైడ్స్

Services

GOLD FINANCE
■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 81422 37635 [B-2654]

Wanted
■ RJY లో అమెజాన్ ప్రొడక్ట్స్ డెలివరీ చేయడానికి బాయ్స్ కావలెను. 45+ డెలివరీలు రోజుకి చేయాలి. జీతం 15,000/-+5000 పెట్రోల్‌కి, బైక్ & లైసెన్స్ కావలెను. ✆ : 93985 04778, 73968 70961 [R-7723]
■ కన్సల్టెన్సీ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP&డాక్టర్స్ కావలెను.జీ: 15వేలు-40వేలు,ఫ్రీరూమ్+భోజనం.Hyd 7993583999 [HA-16136]
■ హైదరాబాదులో ఇంట్లో ఉండి ఇంటిపని, వంటపని చేయుటకు & పాపని కూడా చూసుకోవడానికి మహిళ కావలెను. వయసు : 30-35. భోజనం, వసతి ఇవ్వబడును. జీతం : 20,000. సెల్ : 94403 96004, 94324 33897 [R-1114]
■ ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం జీ: 20K. Ph: 8977639662, 8977639663 [SCA25007794]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.